సాక్షి
నల్లగొండ
శనివారం, 7, సెప్టెంబర్, 2024



షార్ట్ సర్క్యూట్‌తో పరిశ్రమ దగ్ధం

రంపపు పొట్టు పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు రూ.2 కోట్ల ఆస్తినష్టం వాటిల్లింది.

- 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 589.90 అడుగులు
ఇన్‌ఫ్లో	: 2,36,180 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 1,94,160 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 28,095క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,490 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 3,035 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం:	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.65 అడుగులు
ఇన్‌ఫ్లో	: 5,670 క్యూసెక్కులు
క్రస్ట్ గేట్లు	: 5,670 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: నిల్
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

మంత్రి కోమటిరెడ్డి వినాయక చవితి శుభాకాంక్షలు



నల్లగొండ : వినాయక చవితి సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. వినాయకుడి ఆశీస్సులతో ప్రజలు చేపట్టే ప్రతి కార్యం విజయవంతం కావాలని కోరారు. భారీ వర్షాల వల్ల నష్టపోయిన ప్రజలు, రైతాంగం త్వరగా కోలుకోవాలని ఆ గణనాథుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయకులను పూజించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. వినాయక నవరాత్రులను ప్రజలంతా భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

కలెక్టర్ నారాయణరెడ్డి శుభాకాంక్షలు..

వినాయక చవితి సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఆది దేవుడైన వినాయకుడు సర్వ విఘ్నాలను తొలగించి జిల్లా ప్రజలకు మంచి చేకూర్చాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని, మట్టి గణపతిని పూజించాలని కోరారు.

నవరాత్రులు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

నల్లగొండ క్రైం : వినాయక నవరాత్రి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. అధిక శబ్దం కలిగించే లౌడ్ స్పీకర్లు, డీజేలకు అనుమతి లేదని తెలిపారు. గణేష్ విగ్రహాల వద్ద నిర్వాహకులు స్పీకర్లను తక్కువ సౌండ్‌తో రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలని, ఎవరైనా నిర్వాహకులు లౌడ్‌స్పీకర్లు, డీజే ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ప్రార్థనా మందిరాల వద్ద ఇబ్బందులు కలిగించవద్దని సూచించారు.

విద్యార్థుల చేత పాఠాలు చదివించాలి



విద్యార్థులకు మట్టి వినాయ విగ్రహాలు అందజేస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

మునుగోడు : పాఠశాలలో బోధించిన పాఠాలను కచ్చితంగా చదివించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం కలెక్టర్ నారాయణరెడ్డి పంపిణ మట్టి వినాయక విగ్రహాలను శుక్రవారం మునుగోడులోని జెడ్పీహెచ్ఎస్‌లో అదనపు కలెక్టర్ పంపిణీ చేశారు. అంతకుముందు పాఠశాలలో రిజిస్టర్, రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో మొత్తం 300 మంది విద్యార్థులకు 30 మంది ఉపాధ్యాయులు ఉన్నందున ఒక్కో ఉపాధ్యాయుడు 10 మందిని దత్తత తీసుకొని చదివించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే రంగురంగుల వినాయ విగ్రహాలను ప్రతిష్ఠించవద్దన్నారు.

పంచాయతీలో రికార్డుల పరిశీలన..

మునుగోడు పంచాయతీ కార్యదర్శిపై పలువురు ఆరోపణలు రాగా శుక్రవారం ఆయన రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి మురళి, ఎంపీడీఓ పూజ, ఎంపీఓ స్వరూపరాణి, పాఠశాల హెచ్ఎం రవి, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనానికి స్థల పరిశీలన

నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌కు వచ్చే వినాయక విగ్రహాలను నిమజ్జనానికి అనువైన ప్రదేశాలను మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్ సాగర్‌వద్ద పరిశీలించారు. హాలియా, పెద్దవూర వైపు నుంచి నాగార్జునసాగర్‌కు వచ్చే సమక్క–సారక్క మూడురోడ్ల కూడలి సమీపంలో గల పుష్కరఘాట్‌ను, కృష్ణానది పైగల కొత్త వంతెను పరిశీలించారు. అనంతరం సాగర్ డ్యామ్‌ను సందర్శించారు. ఆయన వెంట పెద్దవూర తహసీల్దార్ సరోజ పావని, సీఐ బీసన్న, ఆర్ఐ దండ శ్రీనివాస రెడ్డి, నందికొండ మున్సిపల్ కమిషనర్ శ్రీను, పెద్దవూర ఎస్ఐ వీరబాబు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

డిండి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీలో నార్మల్ డెలవరీలు అయ్యేలా చూడాలని మండల వైద్యాధికారి ఎస్.శైలికి సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ రవి, దివ్య, తదితరులు ఉన్నారు.

● నవరాత్రులకు రెడీ..



నల్లగొండలో వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు



నల్లగొండలో ఓ వీధిలో విద్యుద్దీపాల వెలుగుల్లో వినాయక మండపం

నామినేషన్‌పై అప్పగింత!

రూ.కోట్ల విలువైన సరుకుల సరఫరాలో అక్రమాలు

ఏదైనా రూ.కోట్ల విలువైన పని అప్పగించాలంటే.. టెండర్లు ఆహ్వానించాలి. కానీ జిల్లా కొనుగోళ్ల కమిటీ (డీపీసీ) గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు కిరాణ సరుకుల సరఫరా బాధ్యతను నామినేషన్‌పై అప్పగించింది. అదికూడా అంతకుముందు కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు సరుకుల సరఫరా టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కే అప్పగించడంలో మతలబు తెలియడం లేదు.

- కేజీబీవీ, మోడల్ స్కూళ్లలో సరఫరాకు టెండర్లు
- ఆ తర్వాత అదే ఏజెన్సీకి టెండర్ లేకుండానే గురుకులాలు, హాస్టళ్లకు సరఫరా బాధ్యత
- అడ్డగోలు రేట్లు.. అప్పనంగా దోచిపెట్టే వ్యూహం
- అక్రమాల దందాలో పావులుగా మారిన అధికారులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలోని కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు ఎక్కువ రేట్లతో నిత్యావసరాలు సరఫరా చేసేలా నిర్ణయించిన యంత్రాంగం అవే రేట్లతో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలకు కూడా సరఫరా చేసేలా నిర్ణయించింది. కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీ), మోడల్ స్కూళ్లలో కాంట్రాక్టర్‌కు పెద్ద ఎత్తున లబ్ధి చేకూర్చేలా కొనుగోళ్ల కమిటీ వ్యవహరించిందన్న ఆరోపణలు ఉన్నా.. అవే రేట్లతో జిల్లాలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు సరుకులను సరఫరా చేసే పనులను కూడా అదే కాంట్రాక్టర్‌కు అప్పగించింది. పైగా రూ.కోట్ల విలువ చేసే నిత్యావసర సరుకుల సరఫరాను నామినేషన్‌పై అప్పగించడం చర్చనీయంశంగా మారింది.

వీటికేవి టెండర్లు...?

జిల్లాలోని 107 కేజీబీవీలతో పాటు మోడల్ స్కూళ్లకు కిరాణం సరుకులు, కూరగాయలు, మాంసం, మసాలాల సరఫరాకు కొనుగోళ్ల కమిటీ టెండర్లు పిలిచింది. వాటిల్లోనే అధికంగా ధరలు కోట్ చేసి కిరాణ సరుకుల సరఫరా టెండర్‌ను ప్రభుత్వ ఏజెన్సీ పేరుతో ఓ కాంట్రాక్టర్ దక్కించుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు అదే కాంట్రాక్టర్‌కు అవే రేట్లతో, పైగా నామినేషన్‌పై ఎలా ఇచ్చారన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు సరుకుల సరఫరాకు టెండర్లు పిలిచి వీటికి ఎందుకు పిలువలేదన్న చర్చ జోరుగా సాగుతోంది. ఈ తతంగంలో అధికార పార్టీ నుంచి వచ్చిన ఒత్తిళ్లతో పాటు భారీ ఎత్తున డబ్బులు చేతులు మారినట్లుగా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రభుత్వానికి నష్టం చేకూర్చే పనులెందుకు?

ముడుపులు బాగోతం, రాజకీయ ఒత్తిళ్లతోనే ఈ తతంగం అంతా నడిచిందన్న చర్చ జిల్లాలో జోరుగా సాగుతోంది. అందుకే ప్రభుత్వానికి భారీ ఎత్తున నష్టం వాటిల్లినా, కాంట్రాక్టర్‌కు మేలు జరిగేలా వ్యవహరించారన్న ఆరోపణలు వస్తున్నాయి. హోల్‌సేల్ మార్కెట్‌లో కిలో రూ.150 కంది పప్పుకు.. రూ.171గా నిర్ణయించడం.. ఇలా 20 రకాల సరుకుల్లో కిలోకు రూ.10 నుంచి రూ.50 వరకు కాంట్రాక్టర్‌కు అదనంగా లబ్ధి చేకూర్చేలా ధరలు నిర్ణయించారు. దీనిపై కలెక్టర్ నారాయణరెడ్డి దృష్టి సారించి ప్రభుత్వానికి నష్టం వాటిల్లకుండా, విద్యార్థులకు నాణ్యతతో కూడిన పౌష్టికాహారం అందేలా చూడాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

ధరలపై పునఃపరిశీలన ఏదీ?

వాస్తవానికి కేజీబీవీ, మోడల్ స్కూళ్లకు కిరాణ సరుకుల సరఫరాకు టెండర్లు పిలిచినప్పుడే గందరగోళం జరిగింది. దాదాపు 17 మంది వరకు కాంట్రాక్టర్లు పాల్గొన్నా.. వారిపై ఒత్తిడి తెచ్చి ఉపసంహరించుకునేలా చేశారు. టెండర్ నిబంధనలో రూ.10 కోట్ల టర్నోవర్ రూ.10 కోట్ల సాల్వెన్సీ సర్టిఫికెట్ ఉండాలని నిబంధన చేర్చి కొందరికి అనుకూలంగా వ్యవహరించారన్న విమర్శలు వచ్చాయి. ఇలాంటి తరుణంలో హోల్‌సేల్ మార్కెట్‌లో.. వాస్తవ ధరలను ఎందుకు పునఃపరిశీలన చేయలేదన్న విమర్శలు వచ్చాయి. అలాంటి సమయంలో అవే ధరలకు, అదే కాంట్రాక్టర్‌కు గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లకు నిత్యావసర సరుకుల సరఫరా అప్పగించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి.

సెల్ఫీ విత్ గణేశ్



మీరు విఘ్నేశ్వరుడిని ప్రత్యేక ఆకృతుల్లో ప్రతిష్ఠించారా.. పర్యావరణాన్ని కాపాడే రీతిలో గానీ, ఏ అంశంపైనైనా సమాజానికి సందేశం ఇచ్చే రీతిలో మీ వినాయకుడు ఉన్నాడా.. మీ కాలనీల్లో, అపార్ట్‌మెంట్‌లలో ఏర్పాటు చేసుకున్న వినాయకుడు ఏదైనా స్పెషల్ గెటప్‌లో ఉన్నాడా.. అయితే, మీ వినాయకుడితో మీరు సెల్ఫీ తీసుకుని మాకు పంపితే.. ఆ ఫొటోలలో ఎంపిక చేసి ప్రచురిస్తాం.

మీరు సెల్ఫీ పంపాల్సిన వాట్సప్ నం. 99596 25086

నీలగిరికి రూ.కోటి

- స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ జాతీయ స్థాయిలో రెండవ స్థానం
- నేడు జైపూర్‌లో అవార్డు అందుకోనున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్



నీలగిరి రెండవ స్థానం దక్కించుకుంది.

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీకి రూ.కోటి ప్రోత్సాహకం దక్కనుంది. స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ కింద దేశంలోనే రెండవ స్థానంలో నిలిచిన విషయం తెలిసిందే. పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్ (ఎన్‌సీఏపీ) కింద నిర్వహించిన స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా నీలగిరి మున్సిపాలిటీ ఎంపికైంది. దేశ వ్యాప్తంగా 2023–24 ఆర్థిక సంవత్సరంలో 131 నగరాలు స్వీయ అంచనా నివేదికలు సమర్పించగా వాటిని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ (సీపీసీబీ) మూల్యాంకనం చేసింది. దాంతో జాతీయ స్థాయిలో నీలగిరి మున్సిపాలిటీ రెండవ స్థానం దక్కించుకుంది. ఎయిర్ పొల్యూషన్ రాకుండా మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించడం వల్ల స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో ఎంపిక కావడంతో పట్టణ ప్రతిష్ట పెరిగింది. దాంతో మున్సిపాలిటీకి అవార్డుతో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు రూ.కోటి ఇవ్వనున్నారు.

మౌలిక సదుపాయాలు మెరుగు

నల్లగొండ పట్టణంలో మీడియం మొక్కలు నాటి సంరక్షించడంతోపాటు మట్టి రోడ్లను బీటీరోడ్లుగా మార్చడం, డంపింగ్ యార్డులో మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా మార్చి మొక్కలను నాటి అందంగా తీర్చిదిద్దారు. పొగ తగ్గించే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణకు కృషి చేశారు. దీంతో స్వచ్ఛ వాయు సర్వేక్షణ్‌లో

జైపూర్ వెళ్లిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్

స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ కింద ఎంపికైన మున్సిపాలిటీకి అవార్డు ఇవ్వనున్నారు. రాజస్థాన్‌లో శనివారం జరుగనున్న కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖ మంత్రి చేతుల మీదుగా అవార్డు, నగదు అందుకోవడానికి మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ శుక్రవారం రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌కు వెళ్లారు.

అందరి సహకారంతోనే అవార్డు



మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, పట్టణ ప్రజల సహకారంతోనే స్వచ్ఛ వాయు సర్వేక్షణ్ కింద ఎంపికై అవార్డు దక్కింది. పారిశుద్ధ్యంపై దృష్టి సారించి ఎప్పటికప్పుడు వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. దాంతో మున్సిపాలిటీకి అవార్డు, నిధులు వచ్చాయి.

–బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్

● ఉద్యమ నేతకు కన్నీటి వీడ్కోలు



బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజానీకం



జిట్టా అంతిమయాత్రలో పాడె మోస్తున్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి



జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తదితరులు

మళ్లీ తెరుచుకున్న సాగర్ క్రస్ట్‌గేట్లు



సాగర్ ప్రాజెక్టు 20 గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

- 20గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టు రేడియల్ క్రస్ట్ గేట్లు శుక్రవారం మళ్లీ తెరుచుకున్నాయి. ఎగువన గల శ్రీశైలం జలాశయం నుంచి సాగర్ జలాశయానికి 2,04064 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా అంతే నీటిని విడుదల చేస్తున్నారు. 20రేడియల్ క్రస్ట్‌గేట్లు ఎత్తి స్పిల్‌వే మీదుగా 1,61,800 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 28,339 క్యూసెక్కుల నీటిని దిగువన గల కృష్ణానదిలోకి విడుదల చేస్తున్నారు. కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ, వరద కాల్వల ద్వారా 13,925 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 589.10 అడుగులు ఉంది.

మూసీ ప్రాజెక్టు మూడు గేట్ల ద్వారా..

కేతేపల్లి : మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం ప్రాజెక్టు మూడు క్రస్టు గేట్ల ద్వారా అధికారులు నీటిని విడుదల చేశారు. ఒక్కో గేటును మూడు అడుగుల మేర ఎత్తి 5,670 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలకు నీటి విడుదల నిలిపి వేశారు. 645 అడుగుల గరిష్ట నీటి మట్టం గల మూసీ ప్రాజెక్టులో శుక్రవారం నీటి మట్టం 642.20 అడుగుల వద్ద ఉంది.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

సాగర్ ఎడమకాల్వకు శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తున్నారు. వారం క్రితం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగిత రామచంద్రాపురం సమీపంలో ఎడమకాల్వ 133.06 కిలోమీటరు వద్ద గండి పడిన విషయం తెలిసిందే. దీంతో కాల్వకు నీటిని నిలిపివేశారు. గండి పూడ్చడానికి సమయం పడుతుండడంతో.. ఎడమకాల్వపై తడకమళ్ల వద్ద హెడ్‌రెగ్యులేటర్ గేట్లు మూసివేసి అక్కడి వరకు ఉన్న ఆయకట్టుకు నీరు ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ప్రస్తుతం ఎడమకాల్వపై రాజవరం నుంచి తడకమళ్ల మేజర్ల వరకు గల ఆయకట్టుతో పాటు ఎత్తిపోతల పథకాల కింద ఉన్న 1,53,542 ఎకరాలకు నీరందనుంది.



సాయుధ పోరాటాన్ని రాజకీయం చేయొద్దు



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

- సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు

చిట్యాల : భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం, భూస్వాములకు, రజాకార్లకు వ్యతిరేకంగా పల్లెల్లో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని బీజేపీ మతంరంగు పులిమి రాజకీయం చేస్తోందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లిలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవాల సందర్భంగా ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ప్రారంభించిన 'అమరుల యాదిలో.. శౌర్య యాత్ర' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నాటి స్వాతంత్ర్య, సాయుధ రైతాంగ పోరాటలను గుర్తు చేయాల్సిన పాలకు వాటిని రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి మాట్లాడుతూ కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా పది లక్షల ఎకరాల భూములు పేదలకు పంచారని, ఈ పోరాటంలో నాలుగు వేల మంది వీరులు ప్రాణ త్యాగాలు చేసారని గుర్తు చేశారు. అనంతరం సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి విలేకరులతో మాట్లాడారు. పాలకుల దోపిడీని అరికట్టేందుకు సీపీఎం ఆధ్వర్యంలో మరో పోరాటానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, వీరారెడ్డి, జిట్ట నగేష్, శంకరయ్య, చినవెంకులు, లింగస్వామి, మహేష్, శ్రీను, అరుణ, వెంకటేశ్వర్లు, సుధీర్, జహంగీర్, యాదయ్య ఉన్నారు.

హెచ్‌ఐవీ కేసులను తగ్గించాలి



వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ టౌన్ : హెచ్‌ఐవీ కేసులు తగ్గించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కృషి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. హెచ్‌ఐవీ కేసులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై దృష్టి సారించి ఎయిడ్స్‌పై అవగాహన కల్పించాలన్నారు. శుక్రవారం ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ద్వారా జిల్లాకు కేటాయించిన సంచార సమీకృత హెచ్‌ఐవీ పరీక్ష వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, వాహన సౌకర్యం లేని ప్రాంతాల్లో హెచ్‌ఐవీ కేసుల గుర్తింపు బాధితులకు చికిత్స అందించేందుకు సంచార వాహనం ఉపయోగపడుతుందన్నారు. ఈ వాహనం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన, చికిత్స, కౌన్సిలింగ్, రక్త పరీక్షలు నిర్వహించడం వంటి కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. గర్భిణులకు ఎయిడ్స్ పాజిటివ్ వస్తే.. ముందుగానే గుర్తించి చికిత్స అందిస్తే బిడ్డకు నెగెటివ్ వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ అరుంధతి, డాక్టర్ కళ్యాణ్‌చక్రవర్తి, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్, సంపతయ్య పాల్గొన్నారు.


జిట్టా బాలకృష్ణారెడ్డి కుటుంబసభ్యులను ఓదారుస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


జిట్టా మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

ప్రజా సమస్యలే ఎజెండాగా పోరాటం

- వివేకానందుని స్ఫూర్తితో.. యువతను ఏకం చేసిన జిట్టా
- తెలంగాణ మలిదశ ఉద్యమంలో బాలకృష్ణారెడ్డిది ప్రత్యేక పాత్ర
- మూసీ ప్రక్షాళన కోసం పాదయాత్ర
- చివరకు ఉద్యమ పార్టీలోనే తుదిశ్వాస విడిచిన నేత

సాక్షి,యాదాద్రి : తెలంగాణ అస్తిత్వం, తన ప్రాంత ప్రజల అభివృద్ధి, యువత బాగోగుల కోసం జీవితాంతం రాజీలేని పోరాటం చేశారు జిట్టా బాలకృష్ణారెడ్డి. హైదరాబాదులో 1992లో వివేకానంద యువజన సంఘం స్థాపించారు. రాష్ట్ర స్థాయిలో యువజన సంఘాల సమితిని ఏర్పాటు చేసి 10వేల సంఘాలను ఒకే వేదికపైకి తీసుకొచ్చారు. 1992 నుంచి ఇప్పటి తుది శ్వాస విడిచే వరకు స్వామి వివేకానందుడి బాటలో పయనించారు. యువతను చైతన్య పరిచి.. సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఉచిత ఆరోగ్య శిబిరాలు, గ్రామీణ క్రీడలు, శ్రమదానం, రక్తదానాలను ప్రోత్సహించారు. జిట్టా స్వయంగా 18 సార్లు రక్తదానం చేశారు. గుమ్మి విజయ్ కాంత్ రెడ్డి కన్వీనర్‌గా, మహేష్ ఆదిత్య కోకన్వీనర్‌గా ఉత్తర అమెరికాలో యువజన సంఘాల సమితి ఏర్పాటు చేసి దాని ద్వారా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

విద్య కోసం చేయూత

తన మేనమామ, ప్రవాస భారతీయుడు డాక్టర్ చిలుముల రాంచంద్రారెడ్డి ఫౌండేషన్ సాయంతో 2003లోనే రూ.1.20 కోట్ల వ్యయంతో భువనగిరిలో అమ్మమ్మ తాత పేర్లతో చిలుముల శివరాజిని నారాయణరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మించారు. భువనగిరిలోని సీఎస్ఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీ వద్ద స్వామి వివేకానంద కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. తన తల్లి జిట్టా రాధమ్మ పేరుతో ఏర్పాటు చేసిన ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేశారు.

మూసీ ప్రక్షాళనకు పాదయాత్ర

మూసీ నది ప్రక్షాళన కోసం 200 కిలో మీటర్ల పాదయాత్ర చేశారు బాలకృష్ణారెడ్డి. 2005 ఏప్రిల్ 10వ తేదీ నుంచి ఏప్రిల్ 17వ తేదీ వరకు వలిగొండ నుంచి గ్రామాలు పర్యటిస్తూ హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టారు. అదే హైదరాబాద్‌లో భారీ బహిరంగసభ నిర్వహించారు. అప్పటి ప్రభుత్వం మూసీ జలాల శుద్ధికి రూ.350 కోట్లు విడుదల చేసింది.


తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా భువనగిరిలో ఏర్పాటు చేసిన సభలో కేసీఆర్‌కు గొర్రెను బహూకరిస్తున్న జిట్టా బాలకృష్ణారెడ్డి (ఫైల్)

మూడున్నర కోట్లతో వాటర్ ప్లాంట్లు

భువనగిరి నియోజకవర్గంలో ప్రజలు రక్షిత మంచినీటి కోసం రూ.మూడున్నర కోట్ల నిధులతో 106 గ్రామాల్లో వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వాటర్ ప్లాంట్లు జిట్టా బాలకృష్ణారెడ్డే ఈ ప్రాంత ప్రజలకు పరిచయం చేశారు. 2006వ సంవత్సరంలోనే భువనగిరి ప్రాంత ప్రజలకు కేవలం రెండు రూపాయలకే ఒక క్యాన్ నీటిని అందించారు. నేటికి ఇంకా కొన్ని చోట్ల జిట్టా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లు నీరందిస్తున్నాయి. 2008లో భువనగిరిలోని కిసాన్‌నగర్‌లో రూ.6 లక్షల తన సొంత నిధులతో పార్కును అభివృద్ధి చేశారు. 30 మంది ఇంజనీరింగ్ విద్యార్థులకు ఫీజులు చెల్లించి ఆదుకున్నారు.

నిమ్స్ కోసం అలుపెరుగని పోరాటం

జిట్టా బాలకృష్ణారెడ్డి ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేశారు. బీబీనగర్ వద్ద నిమ్స్.. ఎయిమ్స్‌గా మారే వరకు వివిధ రూపాల్లో పోరాటం చేశారు. 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి శంకుస్థాపన చేసి నిమ్స్‌ను 2009లో పూర్తి చేసి ప్రారంభించే వరకు రాజీలేని పోరాటం చేశారు. 2017లో తెలంగాణ సర్కారు ఈ ఆస్పత్రిని సినిమా షూటింగుల కోసం ఇచ్చే ప్రయత్నం చేస్తే దానిని అడ్డుకునే పోరాటం చేశారు జిట్టా. ఈ క్రమంలో అప్పటి ప్రభుత్వం కేసు నమోదు చేయడంతో మూడు రోజులు జైలుకు వెళ్లారు.



మూసీ ప్రక్షాళన పాదయాత్రలో భాగంగా మాట్లాడుతున్న జిట్టా బాలకృష్ణారెడ్డి (ఫైల్)

స్వచ్ఛమైన సాగునీటి కోసం పోరు

భువనగిరి నియోజకవర్గ రైతాంగానికి కృష్ణా జలాలు ఇవ్వాలన్న డిమాండ్‌తో నియోజకవర్గంలో 2008లో 350 కిలో మీటర్ల పాదయాత్ర చేశారు. మూసీ కాలువలైన బునాదిగాని కాలువ, పిల్లాయిపల్లి కాలువ, బొల్లేపల్లి కాలువ కోసం ధర్నాలు, రాస్తారోకోలు, దీక్షలతో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు.

యువ తెలంగాణ జేఏసీ ఏర్పాటు

తెలంగాణ రాష్ట్ర సాధనే ధ్యేయంగా పనిచేసిన జిట్టా బాలకృష్ణారెడ్డి యువ తెలంగాణ జేఏసీని ఏర్పాటు చేశారు. తెలంగాణ రణభేరి, తెగదెంపుల సంగ్రామం పేరుతో తెలంగాణ జిల్లాల్లో భారీ బహిరంగ సభలు, సదస్సులు ఢిల్లీలో తెలంగాణ జాతర నిర్వహించి ఉద్యమ స్ఫూర్తిని విస్తరింపజేశారు. సాగరహారం, మిలియన్ మార్చ్, రైల్ రోకో, రాస్తారోకో, వంటా- వార్పు వంటి అనేక కార్యక్రమాలు చేపట్టారు.

యువ తెలంగాణ పార్టీ స్థాపన

యువ తెలంగాణ జేఏసీ నుంచి యువ తెలంగాణ పార్టీని ఏర్పాటు చేశారు. వ్యవస్థాపక అధ్యక్షునిగా జిట్టా బాలకృష్ణారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాణిరుద్రమ బాధ్యతలు తీసుకున్నారు. పాడి రైతులకు లీటరు పాలకు నాలుగు రూపాయల ప్రోత్సాహకం అందించేందుకు యువ తెలంగాణ ఆధ్వర్యంలో ప్రగతి భవన్‌ను ముట్టడించారు. రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే వరకు ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వ విధానాలపై, గల్ఫ్ కార్మికుల సమస్యలపై, కళాకారుల సమస్యలపై, ప్రైవేట్ కంపెనీల్లో స్థానికులకు 80శాతం రిజర్వేషన్ కోసం, బస్వాపురం భూ నిర్వాసితుల కోసం, అసైన్డ్ భూముల విషయంపై పోరాటం చేశారు. ఫార్మా కంపెనీల వల్ల చౌటుప్పల్, భూదాన్ పోచంపల్లి, బీబీనగర్ పరిసర ప్రాంతాలు విషతుల్యం అవుతుండడంతో వాటిపై నియంత్రణ కోసం పోరాటం చేశారు.

వ్యక్తిగత వివరాలు

పూర్తి పేరు : జిట్టా బాలకృష్ణారెడ్డి
జననం: 14-12-1972
తల్లిదండ్రులు : రాధమ్మ- బాల్ రెడ్డి (రిటైర్డ్ టీచర్)
భార్య : సునీత
సంతానం : వివేకానందరెడ్డి, ఝాన్సీ
విద్యార్హతలు : బీకాం
జన్మస్థలం : బొమ్మాయిపల్లి, భువనగిరి మున్సిపాలిటీ

ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం

2019 సెప్టెంబర్ 15న రాష్ట్రంలో టీఆర్ఎస్ రెండో సారి అధికారంలోకి వచ్చాక.. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చకపోగా, ప్రశ్నించే గొంతుకలను నొక్కేస్తున్న తరుణంలో.. తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

బీజేపీలో విలీనం

ఉద్యమ ఆకాంక్షల సాధన కోసం యువ తెలంగాణ పార్టీని 2022 ఫిబ్రవరిలో బీజేపీలో విలీనం చేశారు. 2022, జూన్2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భారతీయ జనతా పార్టీ పరంగా నిర్వహించిన ఉద్యమ ఆకాంక్షల సాధన సభకు కన్వీనర్‌గా నియమితులై సభ నిర్వహించారు. అప్పుడు జిట్టా బాలకృష్ణారెడ్డిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రలో సహ ప్రముఖ్ గా నియమితులై చురుగ్గా పనిచేశారు. ఆ తర్వాత పార్టీ విధానాలను ప్రశ్నించి బీజేపీ నుంచి సస్పెన్షన్‌కు గురయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ముందు 2023లో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన జిట్టా ఆ తర్వాత కొన్ని రోజులకే అక్టోబర్ 20న బీఆర్ఎస్‌లో చేరారు. సొంత ఇంటికి చేరుకున్నానని ప్రకటించారు. చివరిసారిగా జనవరిలో సంక్రాంతి పండుగ సందర్భంగా భువనగిరిలో సంక్రాంతి సంబురాలు, జిల్లా స్థాయి గ్రామీణ క్రీడలు నిర్వహించారు. పలువురు తెలంగాణఉద్యమకారులను సన్మానించారు.

తెలంగాణ సంబురాలు నిర్వహించిన మొదటి నేత

- తెలంగాణ చరిత్ర, సంస్కృతిని ఢిల్లీ దాకా పరిచయం చేసిన నాయకుడు

జిట్టా బాలకృష్ణారెడ్డి తెలంగాణ మలి దశ ఉద్యమానికి తెలంగాణ సంస్కృతి, సంబురాలను జత చేసి కొత్త పుంతలు తొక్కించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యాటక, శిల్పకళా వైభవాన్ని చాటి చెప్పేలా తెలంగాణ జాతరలు, సంబురాలను నిర్వహించి ఉద్యమానికి ఊపు తీసుకువచ్చారు. భువనగిరి ఖిల్లాను విద్యుత్ కాంతుల వెలుగులో ప్రపంచానికి తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వంటకాలను భువనగిరి నుంచి ఢిల్లీ ఎర్రకోట వరకు పరిచయం చేశారు. భువనగిరిలో 2007 ఫిబ్రవరిలో మొదటి సారిగా తెలంగాణ సంస్కృతి, వంటకాలు, పండగలపై 'తెలంగాణ జాతర' నిర్వహించారు. జాతర సభలో తెలంగాణలో మొదటిసారిగా కేసీఆర్‌కు గొర్రెపిల్ల, గొంగడి బహూకరించి గొల్ల కురుమల ప్రాముఖ్యతను చాటారు. 2007, మార్చిలో నిజాం కాలేజీ గ్రౌండ్స్, హైదరాబాద్ వేదికగా తెలంగాణ సంబురాలు నిర్వహించారు. 2010లో ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్ గ్రౌండ్‌లో తెలంగాణ నుంచి గంగిరెద్దు, చేనేత మగ్గం, కుమ్మరి సారె, కమ్మరి కొలిమి, వడ్రంగి, చేతివృత్తుల పనిముట్లు, కోయ, డప్పు, డోలు, చిందు, యక్షగానం, బోనాలు, బతుకమ్మ వివిధ కళారూపాలతో పాటు కళాకారులతో ఉత్సవం చేశారు. తెలంగాణ వంటకాల ప్రదర్శన ఏర్పాటు చేసి, తెలంగాణ జాతర నిర్వహించారు. 2007 తెలంగాణ సంబురాలలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పరిచయం చేసి ఇప్పటికి బీఆర్ఎస్ తెలంగాణ భవన్‌లో మొట్టమొదటి తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిట్టా సొంత ఖర్చుతో ఏర్పాటు చేయించారు.

చివరి వరకూ నెరవేరని కల

- ప్రజాప్రతినిధి కాకుండానే కన్నుమూసిన జిట్టా బాలకృష్ణారెడ్డి

వివిధ పార్టీల్లో చేరినా ప్రధాన పార్టీలేవీ జిట్టా బాలకృష్ణారెడ్డికి టికెట్ ఇవ్వలేదు. స్వతంత్ర అభ్యర్థిగా పలుమార్లు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచారు. 2004 నుంచి 2018 వరకు భువనగిరి నుంచి అసెంబ్లీకి పోటీ చేసినా ఆయన గెలుపందుకోలేకపోయారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం 2003 డిసెంబర్ 28న జిట్టా బాలకృష్ణారెడ్డి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. టీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. 2004లోనే భువనగిరి అసెంబ్లీ టికెట్ ఇస్తామని పార్టీ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చినప్పటికీ సీనియర్ నేత ఆలె నరేంద్ర భువనగిరి నుంచి పోటీచేశారు. బాలకృష్ణారెడ్డి ఆ ఎన్నికల్లో నరేంద్రకు మద్దతు ఇచారు. 2009లో మహాకూటమి పొత్తుల్లో భాగంగా భువనగిరి సీటును సిట్టింగ్ స్థానాన్ని టీడీపీకి కేటాయించారు. దీంతో జిట్టా టీఆర్ఎస్ పార్టీని వదిలారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయగా.. 43,720 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. ఆ ఎన్నికల తర్వాత జిట్టా బాలకృష్ణారెడ్డి వైఎస్ రాజశేఖరరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం 2009 డిసెంబర్ 9వ తేదీన తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇస్తూ ప్రకటన ఇచ్చింది. కానీ ఆ వెంటనే కొద్ది రోజులకే డిసెంబర్ 23వ తేదీన తెలంగాణ ప్రకటన వెనక్కి తీసుకోవడంతో జిట్టా కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. భువనగిరిలో 2014 ఎన్నికల్లో యువ తెలంగాణ పార్టీ నుంచి పోటీ చేయగా 39,270 ఓట్లు వచ్చాయి. 2018 ఎన్నికల్లో బీజేపీ మద్దతులో యువ తెలంగాణ పార్టీ నుంచి పోటీచేసి ఓడిపోయారు. మూడు సార్లు వరుస ఓటములు చవిచూశారు. ఆస్తులు అమ్ముకుని ఆర్థికంగా దెబ్బతిన్నా... గుండె ధైర్యం వీడకుండా తెలంగాణ రాష్ట్రం వచ్చాక కూడా ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండాగా పోరాటాలు కొనసాగించారు. ప్రజల కోసం తన జీవితాన్ని, ఆస్తిపాస్తులను, రాజకీయాలను, భవిష్యత్తును త్యాగం చేసిన జిట్టాను ఆయన అభిమానులు కొనియాడుతున్నారు.


నివాళులర్పిస్తున్న జగదీష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, చింతల వెంకటేశ్వర్‌రెడ్డి


ఆస్పత్రి వద్ద జిట్టా బాలకృష్ణారెడ్డి పార్థివ దేహాన్ని చూస్తున్న మాజీ మంత్రులు హరీష్‌రావు, సబితాఇంద్రారెడ్డి, మల్లారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్


రోదిస్తున్న డాక్టర్ చెరుకు సుధాకర్, జిట్టా స్నేహితులు

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక

నల్లగొండ రూరల్: ఎన్ఎస్ఎస్ జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొనేందుకుగాను 10 మంది వలంటీర్లను శుక్రవారం మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఎంపిక చేశారు. వీరు కర్ణాటక రాష్ట్రంలో ఈ నెల 17 నుంచి 23 వరకు జరిగే జాతీయ సమైక్యతా శిబిరంలో పాల్గొంటారని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి తెలిపారు. పురుషుల విభాగం నుంచి శివప్రసాద్, రంగసాయి, బన్ని, విష్ణువర్ధన్, నాగార్జున ఎంపిక కాగా, మహిళల విభాగం నుంచి రూప, అంజలి, నందిని, అక్షర ఎంపికైనట్లు చెప్పారు. వీరిని ఎంజీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అల్వాల రవి, కొప్పుల అంజిరెడ్డి, మాధవిజ్యోతి అభినందించారు.



ఎంపికైన వలంటీర్లు

పరిశోధనలపై అవగాహన సదస్సు

నల్లగొండ రూరల్: బయో ఇంధనం, ఇతర ఉత్పత్తుల పరిశోధనల ద్వారా రానున్న రోజుల్లో పర్యావరణ రక్షణ, ఆర్థిక, ఉద్యోగితలో మార్పులు వస్తాయని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ శాస్త్రవేత్తలు మధుసూదన్ రెడ్డి, సుబ్బారెడ్డి యతీష్ అన్నారు. శుక్రవారం ఎంజీ యూనివర్సిటీలో బయో టెక్నాలజీ రంగంలో పరిశోధనలు, భారత భవిష్యత్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రేమ్ సాగర్, తిరుమల, రామచంద్ర గౌడ్, సమ్రీన్, ప్రియదర్శిని, తిరుపతి పాల్గొన్నారు.

రంపపుపొట్టు పరిశ్రమలో షార్ట్‌సర్క్యూట్

- సుమారు రూ.2 కోట్ల ఆస్తినష్టం

కట్టంగూర్: కట్టంగూర్‌లోని మల్లారం రోడ్డులో గల రంపపుపొట్టు పరిశ్రమలో శుక్రవారం ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్ జరిగి మూడు డీసీఎంలు, రెండు యంత్రాలు, రేకుల షెడ్ దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కట్టంగూర్‌కు చెందిన ఇద్దరు అన్నదమ్ములు చెరుకు రమేష్, నాగరాజులు సాయమ్మ ట్రేడర్స్ పేరుతో రంపపు పొట్టు పరిశ్రమ నిర్వహిస్తున్నారు. రోజు మాదిరిగా పరిశ్రమ వద్ద పనులు ముగించుకొని గురువారం రాత్రి 10 గంటల సమయంలో మూడు డీసీఎంలలో రంపపుపొట్టును లోడ్ చేసి తాళం వేసి వెళ్లారు. గురువారం అర్ధరాత్రి పరిశ్రమలో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. దీంతో షెడ్‌లోని రంపపుపొట్టుకు మంటలు అంటుకున్నాయి. పక్క షెడ్ ఓనర్ సమాచారం ఇవ్వడంతో అన్నదమ్ములు శుక్రవారం పరిశ్రమ వద్దకు చేరుకున్నారు. అప్పటికే దట్టమైన మంటలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఫైరింజన్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఫైరింజన్ సిబ్బంది, రెండు జేసీబీల సాయంతో షెడ్‌లో ఉన్న రంపపు పొట్టు బస్తాలను తొలగిస్తూ మంటలను ఆర్పారు. రూ.35లక్షల విలువ చేసే యంత్రాలు, రూ.66 లక్షలు విలువ చేసే మూడు డీసీఎంలు, రూ.50 లక్షలు విలువ చేసే రేకుల షెడ్, రూ.36 లక్షల విలువ చేసే రంపపు పొట్టుతో కలిపి మొత్తం సుమారు రూ.2 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఆర్ఐ కుమార్‌రెడ్డి అక్కడకు చేరుకుని పంచనామా నిర్వహించారు. కాగా.. మంటలు వ్యాపించి విద్యుత్ సరఫరా నిలిచిపోవటంతో రిమోట్ పనిచేయక షెడ్ షెటర్లు తెరుచుకోలేదు. దీంతో షెడ్ ఒక రేకును బలవంతంగా తొలగించి లోపలికి వెళ్లిన నాగరాజుకు స్వల్ప గాయాలయ్యాయి. ఎమ్మెల్యే వేముల వీరేశం సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నకిరేకల్, నల్లగొండ ఫైర్ స్టేషన్ అధికారులు సాయిదీపక్, సత్యనారాయణరెడ్డి, సిబ్బంది ఫియాజ్‌ఖాన్, సురేష్‌కుమార్, సదానందం, రామయ్య ఉన్నారు.


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది